క్లుప్తంగా

వైవీయూలో సీసీ కెమెరాలతో నిఘా పెంపు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో సీసీ కెమెరాల నిఘా పెంచారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అన్ని విభాగాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, విశ్వవిద్యాలయాన్ని పూర్తిస్థాయిలో సీసీ కెమెరాల పరిధిలోకి వచ్చేలా ఐటీ సెల్ సంచాలకులు ప్రొఫెసర్ టి.శివప్రతాప్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ప్రధాన ద్వారం వద్ద జరుగుతున్న పనులను శుక్రవారం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పరిశీలించారు. వీసీ వెంట రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథ్ రెడ్డి ఉన్నారు.

విద్యార్థుల కోసం ఆధ్యాత్మిక శిబిరం

కడప కల్చరల్ : విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పిరమిడ్ స్పిరుచ్యువల్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు పిరమిడ్ ధ్యాన కేంద్రంలో వేసవి శిక్షణా శిబిరం ప్రారంభమైంది. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చింతన పెంచేందుకు సొసైటీ అధ్యక్షులు ప్రొఫెసర్ జీవీ శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఊర్మిల ఆధ్వర్యంలో ఈ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు ధ్యానం, యోగా, చిత్రలేఖనం, సంగీతం, క్యూబింగ్, నృత్యం, భగవద్గీత పఠనం తదితర అంశాలలో శిక్షణ ఇస్తున్నారు. బాలల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీసి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసే దిశగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నషాన్



నషాన్ ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం రహమతుల్లావీధిలోగల చారిత్రాత్మక చాంద్ ఫిరా గుంబద్ దర్గా నషాన్ ఉత్సవాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ముతవల్లి అమీరున్నిసా ఇంటి నుండి గంధాన్ని ఫకీర్ల మేళ తాళాలతో దర్గా వద్దకు తీసుకువచ్చి ఫాతేహ చేసి గురువుల మజార్‌పై గంధాన్ని సమర్పించారు. అలాగే దర్గా ఆవరణంలో ఉన్న జెండా దగ్గర నషాన్ ఉత్సవం నిర్వహించారు.

సంక్షేమ సారథే ముఖ్యమంత్రి కావాలి

కడప కల్చరల్ : ప్రజల సంక్షేమానికి కృషి చేసే వారే ముఖ్యమంత్రిగా రావాల్సిన అవసరముందని పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ అన్నారు. రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు అన్ని వర్గాల సంక్షేమంతో నడిపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ వారు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం కడప నగరం బిల్టప్ సమీపంలోని కృపా కాలనీలోగల న్యూ నేటివ్ కృపా ప్రార్థన మందిరంలో వైఎస్ జగన్ తిరిగి సీఎం కావాలని, సకాలంలో వర్షాలు కురవాలని భక్తులతో కలిసి ఉపవాస ప్రార్థనలు చేశారు.

హ్యాట్రిక్ విజయం సాధిస్తా..

'సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో సువర్ణపాలన అందించారు. కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేశారు. ప్రతీ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు విడుదల చేశారు. ఆ నిధులతో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేయగలిగాం. ముఖ్యంగా కమలాపురం నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించాం. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాం. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంతో ప్రజలతో మరింత చేరువయ్యాం. ప్రతీ గడపలో మాకు అపూర్వ ఆదరణ లభించింది. జగనన్న సంక్షేమ పథకాలు.. నా నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో హ్యాట్రిక్ విజయం సాధిస్తాను.' అని కమలాపురం ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై ప్రస్తావించారు. ఆ వివరాలు ఇవి.

– వల్లూరు

■ కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మీ విజయావకాశాలు ఏవిధంగా ఉన్నాయని అనుకుంటున్నారు.?

కమలాపురం స్థానం నుండి వరుసగా మూడవ సారి వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తాననే నమ్మకం బలంగా ఉంది. వైఎస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలు నా విజయం కోసం అహర్నిశలూ కృషి చేస్తున్నారు. నా నియోజకవర్గ ప్రజల ఆశీస్సులూ నాకు మెండుగా ఉన్నాయి. జగన్‌ను రెండవ సారి సీఎంగా చేసుకోవడానికి ప్రజలు ఉత్సాహంగా ఉన్నారు.

■ వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యేగా పని చేశారు. ఎలాంటి అభివృద్ధి చేశారు?

నేను మొదటి దఫా ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత టీడీపీ అధికారంలో వున్న కారణంగా అభివృద్ధి చేయడానికి వీలు కాలేదు. అప్పటి సీఎం చంద్రబాబు వివక్ష కారణంగా మన జిల్లా అభివృద్ధికి నోచుకోలేదు. రెండవ సారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత కరోనా మహమ్మారి కారణంగా మొదటి రెండు సంవత్సరాలు అభివృద్ధి పనులు సాగలేదు. తరువాత మూడు సంవత్సరాల్లో నియోజకవర్గం మొత్తం మీద రూ.6,870 కోట్ల నిధులతో అభివృద్ధి పనులను చేపట్టాం. కమలాపురం పట్టణంలో ప్రతి ఇంటికీ తాగు నీటి కోసం ఉచితంగా కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి రూ. 58 కోట్లతో పనులు చేపట్టాం. రూ. 39 కోట్లతో డ్రైనేజీ పనులు చేపట్టాం. రూ.9 కోట్లతో వరద కాలువలు నిర్మించాం. ఆసుపత్రి నూతన భవనం, మునిసిపల్ కార్యాలయం భవన నిర్మాణం, పాలిటెక్నిక్ కళాశాల భవనాలు, ఆర్‌టీసీ బస్టాండు, మునిసిపల్ కాంప్లెక్స్, అర్బన్ హెల్త్ సెంటర్, అగ్రిటెస్టింగ్ ల్యాబ్ నిర్మాణం, ఆర్బీ, రోడ్డు డివైడర్ల నిర్మాణం మొదలైన పనులు చేపట్టాం. రూ. 220 కోట్లతో సర్వరాయ సాగర్ పంట కాలువల పనులు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో రూ.150 కోట్లతో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా, రూ.60 కోట్లతో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రోడ్ల నిర్మాణం చేపట్టాం. రూ.18 కోట్లతో డ్రైనేజీల నిర్మాణం చేపట్టాం. రూ.12.5 కోట్ల వ్యయంతో పొలతల క్షేత్రాన్ని అభివృద్ధి చేశాం. రూ.39 కోట్లతో జరుగుతున్న ఆర్వోబీ పనుల్లో సాయిల్ టెస్ట్‌లు పూర్తయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. కమలాపురం బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణకు ప్రొసీడింగ్స్ వచ్చాయి. త్వరలో టెండర్లు జరగనున్నాయి.

■ మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికైతే ఎలాంటి అభివృద్ధి చేస్తారు?

నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా. జీఎస్‌ఎస్ఎస్ పనులను పూర్తి చేయడం ద్వారా పెండ్లిమర్రి మండలంలో అదనంగా మరో 20 వేల ఎకరాలతో కలిపి మొత్తం 30 వేల ఎకరాలకు నీటిని అందించడానికి చర్యలు చేపడతాను. దీంతో నియోజకవర్గం మొత్తం మీద లక్ష ఎకరాలకు నీటిని అందించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇప్పటికే మొదటి దశ ప్రాసెస్ పూర్తయిన ఆదినిమ్మాయపల్లె బ్యారేజ్ నిర్మాణానికి చర్యలు చేపడతాను. దీని వలన వల్లూరు మండలంలోని చెరువులకు నీటిని అందించడమే కాక చెన్నూరు మండలంలో ఆయకట్టు పెంపు సాధ్యమవుతుంది. కడప పట్టణ తాగు నీటి అవసరాలతో బాటు కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ కు నీటిని అందించడానికి వీలవుతుంది.

■ నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రజల మనోగతం ఎలా ఉంటుందనుకుంటున్నారు?

సాధారణంగా పాలక పక్ష ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండడం చాలా అరుదుగా ఉంటుంది. కానీ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో బాటు పలు కార్యక్రమాల ద్వారా అధిక సమయాన్ని ప్రజలతోనే గడిపాను. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేశాను. ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడంతో బాటు ప్రతి సమస్యను పరిష్కరించా. పథకాలను పారదర్శకంగా అందించాం. అందుకే ప్రజలంతా నన్ను ఆదరిస్తున్నారు.



సాక్షి ఇంటర్వ్యూ

కమలాపురం నియోజకర్గ ప్రజలు ఎలాంటి వ్యక్తిని ఎన్నుకోవాలనుకుంటున్నారని మీరు భావిస్తున్నారు?

కమలాపురం నియోజకవర్గ ప్రజలు శాంతి కాముకులు. రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారు, విజ్ఞులు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలను మనం పరిశీలిస్తే ప్రతి ఎన్నికలో సౌమ్యులుగా పేరు తెచ్చుకున్న వారినే ఆదరిస్తూ వచ్చారు. అందుకే వరుసగా రెండు సార్లు నన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. మూడోసారి కూడా తప్పకుండా నన్నే ఎన్నుకోవడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు.

■ పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా మీరు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎలా సాగుతున్నాయి?

పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. వైఎస్ఆర్ కడప నగర శివార్లలో రిమ్స్ ఆసుపత్రిని నిర్మించారు. రోగులకు తోడుగా వచ్చేవారికి ఉండడానికి గానీ, తినడానికి గానీ ఏమీ అందుబాటులో ఉండేవి కావు. అలాంటి దశలో వైఎస్ఆర్ సూచన మేరకు మా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అక్కడ రూ.కోటితో భవనాన్ని నిర్మించాను. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్ చేత ప్రారంభించాం. అప్పటి నుండి 4 సంవత్సరాలుగా రోగుల అటెండెంట్లకు ఉండడానికి వసతి సౌకర్యంతో బాటు మధ్యాహ్నం, రాత్రి భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నాం. ఇది నాకు ఎంతో సంతృప్తినిస్తున్న కార్యక్రమం. కరోనా కష్ట కాలంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.50 లక్షల తో కూరగాయలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశాం. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో సొంత నిధులతో రోడ్ల వెంబడి వున్న ముల్ల పొదలను తొలగించాం. ట్రస్ట్ ద్వారా నియోజవర్గ వ్యాప్తంగా బస్సు స్టాపులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రజలకు అవసరమైన ప్రాంతాల్లో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశాము. పొలతల క్షేత్రంలో స్వామి వారికి రథాన్ని ఏర్పాటు చేశాను. చెన్నూరు మండలంలో పేద కుటుంబాల వివాహాలకు, వ్యక్తులు మృతి చెందినపుడు దహన సంస్కారాలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం.

■ టీడీపీ మేనిఫెస్టో గురించి?

గతంలో ఎన్నో వేల హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే వాటిని తుంగలో తొక్కిన చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరు. దీనికి తోడు జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే కాక చెప్పని హామీలను సైతం నెరవేర్చి ప్రజల విశ్వాసాన్ని పొందారు. జగన్ చెప్పాడంటే చేస్తాడని ప్రజలు నమ్ముతున్నారు. టీడీపీ కూటమి కేంద్ర ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని రెండు నెలలుగా పెన్షన్‌ల పంపిణీని, విద్యా దీవెన, ఆసరా, ఈబీసీ నేస్తం, చేయూత వంటి పథకాలను అడ్డుకోవడాన్ని ప్రజలు గమనించారు. తిరిగి టీడీపీ పాలన వస్తే ఇలాంటి తిప్పలు తప్పవని ప్రజలు భావిస్తున్నారు. అందుకే వైఎస్ఆర్‌సీపీకి 175 సీట్లలో విజయాన్ని అందించనున్నారు.

■ మీ ప్రచారం ఎలా సాగుతోంది, ప్రజల స్పందన ఎలా ఉంది?

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు ప్రచారం పూర్తి కావచ్చింది. ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మెన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, రాష్ట్ర పరిశ్రమల సలహాదారులు రాజోలు వీరారెడ్డి, పార్టీ ముఖ్య నేత సాయినాథ శర్మతో బాటు నేతలందరితో కలిసి ప్రచారం నిర్వహిస్తున్నాం. మా ప్రచారానికి అన్ని వర్గాల ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. మా ప్రభుత్వం ఏవిధంగా అన్ని వర్గాల ప్రజలకు కులాలు, మతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించిందో అదే విధంగా అన్ని వర్గాల ప్రజలు జగన్‌ను రెండోసారి సీఎంగా చేసుకోవాలని భావిస్తున్నారు. ప్రతి గ్రామంలో టీడీపీ నుండి మా పార్టీలో చేరడానికి ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. ఈ ఎన్నికల్లో నేను అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం తథ్యం.

ఆదరించండి.. ఆశీర్వదించండి



చెన్నూరు : రామనపల్లెలో టీటీడీ బోర్డు మెంబర్ మాసీమబాబు, మాజీ మండల అధ్యక్షులు ముదిరెడ్డి శివారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం

చెన్నూరు : పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆదరించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్‌లు అన్నారు. శుక్రవారం చెన్నూరులోని లక్ష్మీ నగర్, సరస్వతి నగర్, కొత్త గాంధీనగర్‌లలో వారు ప్రచారం చేశారు.

■ చెన్నూరు చౌడమ్మ వీధిలో సొసైటీ అధ్యక్షులు అల్లి శ్రీరామ మూర్తి, సాధు కిషోర్, నాయకులు, కార్యకర్తలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

■ చెన్నూరు మైనార్టీ కాలనీలో నాయకులు అన్వర్‌బాష, మునీర్ అహ్మద్, సాదిక్ అలీ, జుమన్, వారిష్, హస్రత్, అబ్దుల్ రబ్, నూర్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.

■ చెన్నూరులో జెడ్పీటీసీ ముదిరెడ్డి దిలీప్ రెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ముదిరెడ్డి రవీంద్రారెడ్డి, ఆధ్వర్యంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

'మేమంతా సిద్ధం' సభకు కదిలివచ్చిన జనం



ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్



ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డా. శివానాయక్



ర్యాలీ నిర్వహిస్తున్న 4వ డివిజన్ ఇన్‌చార్జి ఆర్‌వీ రమణ



ర్యాలీ నిర్వహిస్తున్న 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు

కడప కార్పొరేషన్ : కడప అసెంబ్లీ నియోజకవర్గంలోని వన్‌టౌన్ సర్కిల్ వద్ద శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభకు కడప నగరం నలుమూలల నుంచి జనం కదిలివచ్చారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా మధ్యాహ్నం 2 గంటల నుంచే సభాప్రాంగణానికి జనం రావడం మొదలైంది. కడపలోని 50 డివిజన్ల నుంచి ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో జనం రాగా, అనుబంధ సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో 4వ డివిజన్ బుడ్డాయపల్లె నుంచి క్రిష్టా సర్కిల్‌వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డా. శివా నాయక్ ఆధ్వర్యంలో వైద్య విభాగం సభ్యులు, కార్యకర్తలు ర్యాలీగా వచ్చారు. 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు, 9వ డివిజన్ ఇన్‌చార్జి మల్లికార్జున కిరణ్, 3వ డివిజన్ ఇన్‌చార్జి వీరారెడ్డి, 4వ డివిజన్ ఇన్‌చార్జి ఆర్‌వీ రమణ ఆధ్వర్యంలో ప్రజలు ర్యాలీగా సభకు వచ్చారు.

ముస్లిం మైనార్టీల ఓట్లు చీల్చేందుకు కూటమి కుట్ర



మాలియా ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ కువైట్ కమిటీ సభ్యులు

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీల ఓట్లు చీల్చేందుకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి, కాంగ్రెస్ కుట్ర చేస్తున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కువైట్ మైనారిటీ సభ్యులు ఆబూతు రబ్, లక్కీ అజీస్, సయ్యద్ సలీమ్ అన్నారు. మాలియాలో జుమా రోజు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లింలు, ముఖ్యంగా కడపలోని ముస్లిం, మైనార్టీలు ఆలోచన చేసి ఓటు వేయాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో విచిత్రమైన రాజకీయం నడుస్తోందని, తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమితో పాటు కాంగ్రెస్ కూడా అనైతిక పొత్తులో ఉందనేది జగమెరిగిన సత్యమన్నారు. తెలుగుదేశం కడప పార్లమెంట్ అభ్యర్థి ప్రచారం చేయకపోవడమే ఇందుకు ఉదాహరణ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ అభ్యర్థిగా ముస్లింను నిలబెట్టి ముస్లింల ఓట్లు చీల్చే కుట్రకు చంద్రబాబు, షర్మిల ప్లాన్ వేశారన్నారు. కరోనా సమయంలో రెండు నెలలు పేదలకు అన్నదానం చేసిన వ్యక్తి, బుగ్గవంక వరదల సమయంలో ప్రాణ, ఆస్థి నష్టం జరక్కుండా స్వయంగా వరదబాధితులను ఆదుకున్న అంజద్‌బాషాను మూడోసారి గెలిపించాలని వారు కోరారు. అలాగే కడప ఎంపీగా వైఎస్ అవినాష్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ముస్లింలను, ప్రజలను కువైట్ నుంచి వారు అభ్యర్థించారు.

కమలాపురం రోడ్ షో.... సక్సెస్



బైక్ ర్యాలీలో పాల్గొన్న యువత



ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గజమాలతో సత్కరిస్తున్న మైనార్టీ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్



బైక్ ర్యాలీలో అభిమానులకు అభివాదం చేస్తున్న జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : కమలాపురం పట్టణంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు షో సక్సెస్ అయింది. శుక్రవారం స్థానిక క్రాస్ రోడ్డు నుంచి గ్రామ చావడి వరకు ప్రత్యేక ప్రచార వాహనంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జున రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, ఇండస్ట్రియల్, హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్లు రాజోలి వీరారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి తదితరులతో కలసి ప్రజలకు అభివాదం చేస్తూ వచ్చారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి దారి పొడవునా అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను పేరు పేరునా ఉచ్చరిస్తూ తనను, ఎంపీ అవినాష్ రెడ్డిను ఆశీర్వదించాలన్నారు. ఎంపీడీఓ సర్కిల్ వద్ద మున్సిపల్ వైస్ ఛైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కౌన్సిలర్ నిఖిల్‌రెడ్డి, పెద్ద దర్గా వద్ద వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్, చావడి వద్ద మణికంఠ శర్మలు గజమాలలతో సత్కరించారు. నాయకుల రాకను పురస్కరించుకుని పార్టీ నాయకులు భారీ ఎత్తున పూల వర్షం కురిపిస్తూ, బాణా సంచా పేల్చుతూ స్వాగతం పలికారు. అనంతరం భోజన వసతి కల్పించారు.

నరేన్ యువత ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

నరేన్ యువత ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్‌ర్యాలీ నిర్వహించారు. క్రాస్ రోడ్డు నుంచి చావడి వరకు సాగిన ఈ ర్యాలీలో యువత జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పుల్లారెడ్డి, గంగాధర్ రెడ్డి, వంశీధర్ రెడ్డి, హిదాయత్, మహ్మద్ సాదిక్, ఇర్ఫాన్, మస్తానయ్య, చెన్నకేశవరెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, సునీల్‌రెడ్డి, దేవదానం, క్రిష్టారెడ్డి, రాజారెడ్డి, శరత్‌బాబు, షావలి, జిలాన్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని మండలాల నుంచి తరలి వచ్చిన కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

యువతకు సామాజిక స్పృహ ఉండాలి



సదస్సులో పాల్గొన్న వారితో మత గురువులు, నిర్వాహకులు

కడప కల్చరల్ : యువతకు ఆధ్యాత్మిక, సామాజిక స్పృహ ఉండాలని, యుక్త వయస్సులో దారి తప్పకుండా సరైన బాటను ఎంచుకుంటే జీవితం ఆనందమయంగా సాగుతుందని పాస్టరల్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఏసు వరప్రసాద్, కడప మేత్రాసన కోశాధికారి ఫాదర్ పెండ్లికట్ల దేవదాసు అన్నారు. శుక్రవారం నగర శివార్లలోని రామాంజనేయపురం పాస్టరల్ సెంటర్ లో కడప డీన్ పరిధి లోని కథోలిక యువతీ యువకులకు వివాహ వ్యవస్థపై శిక్షణా తరగతులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి వారు మాట్లాడుతూ పెళ్లికి ముందు ప్రేమ కంటే పెళ్లి తర్వాత ఒకరినొకరు అర్థం చేసుకుని ప్రేమగా జీవించడమే ముఖ్యమన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో డాక్టర్ సురేష్, డాక్టర్ కరుణాకర్, ఫాదర్ సుధాకర్‌లు కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా ఫాదర్ దేవదాసు దివ్యబలి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాసాపేట విచారణ గురువు రెవ ఫాదర్ గుడిమె దేవ సహాయం, డాక్టర్ భార్గవ్ ఉపదేశి ప్రభాకర్, సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా శిబిరాలతో బాలల్లో మానసిక వికాసం




చిన్నారికి సర్టిఫికెట్ అందజేస్తున్న డీఈఓ అనూరాధ

కడప కల్చరల్ : శిక్షణా శిబిరాలతో విద్యార్థుల్లో మానసిక వికాసం జరిగే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి అనూరాధ అన్నారు. కడప బాలోత్సవం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ (మెయిన్) హైస్కూలులో నిర్వహించిన చిత్రలేఖనం, అభ్యుదయ గీతాల శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలల్లోని ఆసక్తులను గుర్తించి తగిన శిక్షణను ఇస్తే కొత్త శక్తిని పుంజుకుని విద్యల్లో రాణిస్తారని, బహుముఖ ప్రజ్ఞ చూపగలరన్నారు. డాక్టర్ ఓబుల్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బాలోత్సవం ప్రతినిధులు నాగముని రెడ్డి, జి.గోపాల్, రాజశేఖర్ రాహుల్, లక్ష్మిరాజ, విజయకుమార్, మహేష్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న వలసలు



కడప కార్పొరేషన్ : పార్టీలో చేరిన ఓబుల్‌రెడ్డి అనుచరులతో డిప్యూటీ సీఎం అంజద్‌బాష, మేయర్ సురేష్‌బాబు



చింతకొమ్మదిన్నె: ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన మాణిక్యాల వెంకటేశ్ యాదవ్, సుబ్బరాయుడు యాదవ్ తదితరులు



చెన్నూరు: షుగర్ ఫ్యాక్టరీలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరినవారితో సత్యసాయినాథ శర్మ

చింతకొమ్మదిన్నె : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మండల మాజీ జెడ్పీటీసీ మాణిక్యాల వెంకటేశ్ యాదవ్, మాజీ ఉప మండల అధ్యక్షులు చిట్టిబోయిన సుబ్బరాయుడు యాదవ్ (జబ్బార్)లు టీడీపీ నుంచి శుక్రవారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. కడప నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో కండువాలు వేసుకుని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో మల్లు నాగేంద్ర, గంధం కృష్ణయ్య, గంధం మహేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు బొమ్మేపల్లి రెడ్డెన్న, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలకొండ్రాయస్వామి ఆలయ మాజీ చైర్మన్ చేరిక

కడప కార్పొరేషన్ : పాలకొండ్రాయస్వామి ఆలయ మాజీ చైర్మన్ ఓబుల్‌రెడ్డి, అనుచరులు, కుటుంబ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 15వ డివిజన్ ఇన్‌ఛార్జి కె.వీరారెడ్డి, 13వ డివిజన్ కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ సురేష్‌బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషల సమక్షంలో వారు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుభాన్‌బాష, రామ్మోహన్‌రెడ్డి, తోట కృష్ణ, మదన్‌మోహన్‌రెడ్డి, సలాం, ఈశ్వర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 80 కుటుంబాలు చేరిక

చెన్నూరు : పుణ్యభూమి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాశీభట్ల సత్య సాయినాథశర్మ ఆధ్వర్యంలో 80 కుటుంబాలు టీడీపీని వీడి శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. మండలంలోని షుగర్ ఫ్యాక్టరీలో సత్య సాయినాథశర్మ ముఖ్య అనుచరుడు తుపాకుల జనార్దన్‌రెడ్డితోపాటు ఆయన ఆత్మీయులు వార్డు మెంబర్ కుమారునితో సహా 35 కుటుంబాలు, అలాగే షుగర్ ఫ్యాక్టరీ ఎస్టీ కాలనీలో 25 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్ఆర్ సీపీలో చేరాయి. అదే విధంగా చెన్నూరు అరుంధతి నగర్ లో 20 దళిత కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరందరికీ సాయినాథశర్మ పార్టీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ జి ఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ రఘురాం రెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, పెద్ద బుద్ది వెంకట శివప్రసాద్, బ్రహ్మయ్య, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.